‘మనూ’లో 27 నుంచి వార్షిక సదస్సు ప్రారంభం

రాయదుర్గం: మనూలో గాంధేయ జర్నలిజంపై 45వ వార్షిక సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. యూనివర్సిటీలోని మాస్‌ కమ్యూనికేషన్‌ అండ్‌ జర్నలిజమ్‌ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు ఇండియన్‌ సొసైటీ ఆఫ్‌ గాంధీయన్‌ స్టడీస్‌ వార్షిక సదస్సును నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. 27వ తేదీ ఉదయం 10 గంటలకు క్యాంపస్‌లోని సీపీడీయూఎంటీ ఆడిటోరియంలో ప్రారంభ సమావేశాన్ని నిర్వహిస్తారు. ‘మనూ’ వీసీ ఐనుల్‌ హసన్‌ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో భారత్‌ ఎక్స్‌ప్రెస్‌ సీఎండీ ఉపేంద్రరాయ్‌, బీబీసీ న్యూఢిల్లీ ప్రతినిధి ఇక్బాల్‌ అహ్మద్‌, యూనిటీ పీస్‌ ఫౌండేషన్‌ ప్రతినిధి డాక్టర్‌ షహనవాజ్‌ ఆలమ్‌, ఇంటిగ్రో ఆస్పత్రి సీఈఓ డాక్టర్‌ సైమా పాల్గొననున్నారు.

నూతన కార్యవర్గం

రాయదుర్గం: హెచ్‌సీయూలో ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గాన్ని జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌ ప్రకటించారు. హెచ్‌సీయూ వద్ద శనివారం ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ ఏఐఓబీసీఎస్‌ఏ కన్వీనర్‌గా ప్రవీణ్‌ కురుమ, అధ్యక్షుడు సూర్యవర్ధన్‌ సింగ్‌యాదవ్‌, ప్రధాన కార్యదర్శులుగా మౌనిక, చంద్రశేఖర్‌యాదవ్‌లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఏఐఓబీసీఎస్‌ఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ



వృద్ధాశ్రమంలో సరుకులను అందజేస్తున్న సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు

మియాపూర్‌: మియాపూర్‌లోని వివేకానంద వృద్ధాశ్రమంలో గచ్చిబౌలి సైబేజ్‌ సాఫ్ట్‌వేర్‌ కంపెనీ కార్పొరేట్‌ సామాజిక బాధ్యతలో భాగంగా సైబేజ్‌ ఆశా ఆధ్వర్యంలో నెలకు సరిపడా సరుకులను అందజేశారు.ఈ సందర్భంగా సైబేజ్‌ కంపెనీ సీనియర్‌ సీఎస్‌ఆర్‌ ఎగ్జిక్యూటివ్‌ సురేష్‌ మాట్లాడుతూ... అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు చేయూతనిస్తామన్నారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సంఘం నిర్వాహకులు సుందర్‌ ప్రసాద్‌, సైబేజ్‌ కంపెనీ ఉద్యోగులు కిరణ్‌ కుమార్‌, గోపికృష్ణ, కార్తీక్‌ , సంజయ్‌, ఫణికుమార్‌, వినయ, కిరణ్మయి, శిల్ప తదితరులున్నారు.

రక్తదాన శిబిరం

చందానగర్‌: మాదాపూర్‌ డివిజన్‌ పరిధిలోని గోకుల్‌ ప్లాట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ప్రివెంటివ్‌ మెడిసన్‌ సెంటర్‌ ఫర్‌ బ్లడ్‌ సెంటర్‌కు రక్తాన్ని అందించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. కార్యక్రమంలో వైద్యులు శశిధర్‌, మాధవి, కాలనీ అధ్యక్షులు సాంబయ్య, వైద్యులు శివలీల, విజయశాంతి, సరిత పాల్గొన్నారు.

నేడు క్యాన్సర్‌ ఉచిత వైద్యశిబిరం

ఆల్విన్‌కాలనీ: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రామ్‌దేవ్‌రావ్‌ హాస్పిటల్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి మ..2 గంటల వరకు ఉచిత మెగా క్యాన్సర్‌ స్క్రీనింగ్‌ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో నోటి క్యాన్సర్‌, రొమ్ము క్యాన్సర్‌, గర్భాశయ ముఖద్వారం క్యాన్సర్‌, కోలొరెక్టల్‌ క్యాన్సర్‌, మమ్మోగ్రఫీ, ఎక్స్‌ రే, ఎంఆర్‌ఐ,సీబీపీ, లిక్విడ్‌ బేస్‌ సైటాలజీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

వరదనీటి కాలువలు పునరుద్ధరించాలని వినతి

పటాన్‌చెరు టౌన్‌: వరదనీటి కాలువలను పునరుద్ధరించాలని నవ భారత్‌ నిర్మాణ్‌ యువ సేన అధ్యక్షుడు మెట్టు శ్రీధర్‌ శనివారం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌ మాట్లాడుతూ...వర్షాకాలం ముత్తంగిలోని ఎంకె చెరువు నిండిపోవడంతో చిట్కుల్‌ పరిధిలో నూతనంగా ఏర్పడిన నాగార్జున కాలనీ, డిఫెన్స్‌ కాలనీ, రాధమ్మ కాలనీలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. వరదనీటితో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్రీ చైతన్య కళాశాలకు రూ.2 లక్షలు జరిమానా

మాదాపూర్‌: ఫుడ్‌ సేఫ్టీ అధికారులు శ్రీ చైతన్య కళాశాలపై కొరడా ఝుళిపించారు. చందానగర్‌ సర్కిల్‌ ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీ శ్రీ చైతన్య కళాశాల కిచెన్‌ను జీహెచ్‌ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు శనివారం తనిఖీ చేశారు. ఇందులో నాసిరకం కూరగాయలు, శానిటేషన్‌ లీకేజీ, ఫ్లోరింగ్‌కి ప్యాచ్‌లు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో 2 లక్షల రూపాయలు జరిమానా విధించారు. చందానగర్‌ సర్కిల్‌ ఏఎంహెచ్‌ఓ రవి, శేరిలింగంపల్లి ఫుడ్‌ సేఫ్టీ అధికారి హృదయ, సిబ్బంది పాల్గొన్నారు.

తీరనున్న సమస్య.. నిధులొస్తే నెలరోజుల్లో పూర్తి

లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద చురుగ్గా బాక్స్‌టైప్‌ నాలా, కల్వర్టు పనులు

- పనుల పూర్తికి మరో రూ.2 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు
- పనులు పూర్తయితే వరదకు చెక్‌





లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద జరుగుతున్న బాక్స్‌ టైప్‌ డ్రైన్‌ పనులు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద వరద సమస్యకు ఇక చెక్‌ పడనుంది. రూ.4 కోట్లతో చేపట్టిన బాక్స్‌టైప్‌ నాలా, కల్వర్టు నిర్మాణంలో కల్వర్టు పనులు దాదాపు పూర్తికాగా, ఇక నాలా పనులు కూడా సగం పూర్తి చేశారు. ఇవి పూర్తయితే వరద సమస్య తీరనుంది. పనుల నేపథ్యంలో అండర్‌బ్రిడ్జివద్ద బస్సులు, భారీ వాహనాలు వెళ్ళే మార్గం మూసి వేయడంతో సమస్య నెలకొంది. అంతేకాకుండా పలు ప్రాంతాల నుంచి అండర్‌బ్రిడ్జి నుంచి వెళ్లే వాహనాలు లింగంపల్లి రైల్వే స్టేషన్‌ మీదుగా నల్లగండ్ల రైల్వే గేటు నుంచి గుల్‌మొహర్‌పార్కు మీదుగా గచ్చిబౌలికి వెళుతున్నారు. దీంతో దూరభారం పెరగడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్న పరిస్థితి ఏడాదిన్నరగా నెలకొంది. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- మరో 200 మీటర్ల బాక్స్‌ టైప్‌ డ్రైయిన్‌ పూర్త వ్వాల్సి ఉంది
- అండర్‌బ్రిడ్జి వద్ద బాక్స్‌టైప్‌ డ్రైయిన్‌ నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి.
- లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి నుంచి వెంకట్‌రెడ్డి కాలనీ మీదుగా నాలాలోకి కలిపే పనులు
- ఇప్పటికే సుమారు 300 మీటర్ల పనులు కొనసాగుతుండగా, మరో 200 మీటర్లు బాక్స్‌ టైప్‌ డ్రైన్‌ పనులు చేస్తే అండర్‌ బ్రిడ్జి కింద వరద సమస్యను నివారించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

మేయర్‌, ఎమ్మెల్యే దృష్టికి అదనపు నిధుల ప్రతిపాదనలు

- లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద పనులన్నింటినీ పూర్తి చేయడానికి అదనంగా నిధులు అవసరమని అధికారులు ప్రతిపాదించారు.
- బాక్స్‌డ్రైన్‌ నిర్మాణానికి అదనంగా రూ.2 కోట్ల నిధులు కావాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదించారు.
- ఇటీవల నగర మేయర్‌ విజయలక్ష్మి, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌, ఉన్నతాధికారులు పరిశీలనకు రాగా నిధుల విషయం ఆమె దృష్టికి తెచ్చారు. దీంతో నిధుఉల సకాలంలో విడుదల అయ్యే అవకాశం ఉందని అందరూ ఆశిస్తున్నారు.

పనులు పూర్తి కాక.. రాకపోకలకు ఇబ్బందులు..

- లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి కింద బాక్స్‌టైప్‌ డ్రైన్‌ పనులతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు నెలకొన్నాయి
- ముఖ్యంగా తారానగర్‌, చందానగర్‌, మదీనాగూడ తదితర ప్రాంతాల నుంచి గచ్చిబౌలి వైపు వెళ్లే వారు నల్లగండ్ల రైల్‌ ఓవర్‌ బ్రిడ్జి మీదుగానే రావాల్సి ఉండటంతో ఇబ్బందిపడుతున్నారు.
- అదే విధంగా గచ్చిబౌలి–తారానగర్‌ వైపు వెళ్లాలన్నా లింగంపల్లి రైల్వే స్టేషన్‌ 6వ ప్లాట్‌ఫారం వైపుగా వెళ్ళాల్సి ఉంది.
- పాపిరెడ్డి కాలనీ, సురభికాలనీ, రాజీవ్‌ గృహకల్ప, రాజీవ్‌ ఆరంభ్‌ టౌన్‌షిప్‌ తదితర ప్రాంతాల ప్రజలు నిత్యం ఇబ్బందిపడుతున్నారు.



అండర్‌ బ్రిడ్జి మూసివేయడంతో ద్విచక్రవాహనదారుల పాట్లు



పనులను పరిశీలిస్తున్న మేయర్‌ విజయలక్ష్మి, ఎమ్మెల్యే గాంధీ (ఫైల్‌)

త్వరితగతిన పూర్తి చేయాలి



లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద బాక్స్‌టైప్‌ డ్రైన్‌ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. పరిసర ప్రాంతవాసులు, సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి.

– షేక్‌ ఖాసీం, అధ్యక్షులు, గుల్‌మొహర్‌పార్కు కాలనీ

నెల రోజుల్లో పనులు పూర్తి చేస్తాం

లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద పనులు చురుకుగా సాగుతున్నాయి. అండర్‌బ్రిడ్జి నుంచి సమీపంలోని వెంకట్‌రెడ్డి కాలనీ వరకు చేపట్టిన బాక్స్‌టైప్‌ డ్రైన్‌ పనులను నెల రోజుల్లో పూర్తి చేస్తాం. వాహన దారులు, స్థానికులు అధికారులకు సహకరించాలి.

–ఆనంద్‌, డీఈఈ, శేరిలింగంపల్లి సర్కిల్‌

‘ఈపీటీఆర్‌ఐ’లో ముగిసిన సదస్సు

గచ్చిబౌలి: వాతావరణ మార్పులు, మానవ ఆరోగ్య సంరక్షణ, జిల్లాస్థాయి వాతావరణ కార్యాచరణ ప్రణాళిక వంటి అంశాలపై గచ్చిబౌలిలోని ఎన్విరాన్‌మెంట్‌ ప్రొటెక్షన్‌ ట్రైనింగ్‌ అండ్‌ రీసెర్చ్‌ ఇన్‌స్టిట్యూట్‌ (ఈపీటీఆర్‌ఐ)లో రెండు రోజుల సదస్సు శనివారంతో ముగిసింది. తెలంగాణ రాష్ట్ర వాతావరణ మార్పు శాఖ, భారత ప్రభుత్వ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహించారు. వాతావరణంలో మార్పులు, మానవ ఆరోగ్య సంరక్షణ , జిల్లాస్థాయిలో వాతావరణ కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన వంటి అంశాలపై అధికారులు, ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఏ పరిస్థితులలో ఎలాంటి చర్యలు చేపట్టాలి, సమస్యల పరిష్కారం తదితరాలపై అవగాహన కల్పించారు. ఈపీటీఆర్‌ఐ డైరెక్టర్‌ జనరల్‌ అహ్మద్‌నదీమ్‌, రాష్ట్ర ఆరోగ్యశాఖ జాయింట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ సుమిత్రానాయర్‌, ఈపీటీఆర్‌ఐ అధికారులు డాక్టర్‌ రాజేశ్వర్‌, ఐఐపీహెచ్‌ డాక్టర్‌.శైలజ, డాక్టర్‌ జేకేలక్ష్మీ, డీఎస్‌టీ ప్రాజెక్ట్‌ పరిశోధనా విభాగం ప్రవీణ్‌, సాధన, భాస్కర్‌ నాయక్‌, ప్రవీణ్‌చారి, మాధవి, లక్ష్మీనారాయణ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ఈ సదస్సులో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 60 మందికి పైగా ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు భద్రతపై అవగాహన



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నారాయణ సింగ్‌

చందానగర్‌: గచ్చిబౌలి ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ ఆధ్వర్యంలో కొండాపూర్‌లోని సీఆర్‌ ఫౌండేషన్‌లో ఎస్‌ఐ నారాయణసింగ్‌ ట్రాఫిక్‌ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్‌ లైసెన్స్‌ లేకుండా, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. సిగ్నల్‌ జంప్‌, ఓవర్‌ టెక్‌ చేయకూడదని చెప్పారు. కార్యక్రమంలో అక్బర్‌, ఆటో డ్రైవర్స్‌, కాలనీవాసులు దత్తు, రాములు, సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి శ్రీరామ్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు, టీచర్లకు మంచి సంబధాలు ఉండాలి

ప్రాంతీయ పాస్‌ పోర్ట్‌ అధికారిణి జొన్నలగడ్డ స్నేహజ

చందానగర్‌: విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య మంచి సంబంధాలు ఉండాలని ప్రాంతీయ పాస్‌ పోర్ట్‌ అధికారిణి జొన్నలగడ్డ స్నేహజ పేర్కొన్నారు. శనివారం కొండాపూర్‌లోని వరల్డ్‌ వన్‌ పాఠశాల 11వ వార్షికోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల ఎదుగుదలలో స్కూల్‌తో పాటు తల్లిదండ్రుల పాత్ర చాలా ముఖ్యమైందన్నారు. తల్లిదండ్రులు సోషల్‌ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. ఒకింత కఠినంగా ఉండాలని, చదువు ముఖ్యమని చెబుతూ కాసేపు పిల్లలతో గడపాలన్నారు. అనంతరం సినీ దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ ఇంజనీరింగ్‌ విద్యలో మొట్టమొదటి అడుగు విజ్ఞాన్‌దేనన్నారు. చదువుతో పాటు జీవితం గురించి దృష్టి పెట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్‌ విద్యా సంస్థల వైస్‌ చైర్‌పర్సన్‌ రాణి రుద్రమదేవి, ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ సందీప్‌, క్రాంతి కిరణ్‌, ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు, టీచర్లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

కనువిందు.. నృత్యాభినయం

మాదాపూర్‌: కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం అమృత ఆర్ట్స్‌ అకాడమీ గురువు సాయిగీత శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో అలరించారు. మూషికవాహన, తాండవ నృత్యకారి, ఆనందతాండవం, అష్టలక్ష్మి స్తోత్రం, శంకర శ్రీగిరి, స్వాగతం కృష్ణ, భామాకలాపం, కృష్ణశబ్దం, సరస్వతీస్తుతి, అన్నమయ్య కీర్తనలు, రామాయణశబ్దం తదితర అంశాలను కళాకారులు శ్రీనిధి, నిత్యసంతోషి, కార్తీక, చక్రికా, రమిత, కీర్తన, వైష్ణవి, శ్రీజ, హర్షిణి, తీక్షణ, రోషిణి, శాన్విక, ఈషా తదితరులు ప్రదర్శించారు.



అన్నమయ్యపురంలో..

అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం మాధురి శ్రీనాథ్‌ బృందం సంగీత కచేరీని నిర్వహించారు. శిష్యులు భార్గవి, సంగీత, వరలక్ష్మి, త్రిష, అనురాధ, ఆద్య, అన్నపూర్ణ, హరుష, హాసిని, శ్రీహిత్‌, దిశనలు మహాగణపతిం, చక్కనితల్లికి చాంగుభళా, మాధవ కేశవ, చూడరమ్మ సతులారా, తిరుతిరు జవరాల కీర్తనలను ఆలపించారు. తబలా రూపేంద్ర, వయోలిన్‌ ఆనంద్‌ సంగీత సహకారాన్ని అందించారు.



క్లీన్‌ క్యాంపస్‌ లక్ష్యంగా..

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ క్యాంపస్‌ను క్లీన్‌ క్యాంపస్‌గా మార్చడమే లక్ష్యంగా ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం పనిచేస్తుందని ఆ సంస్థ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ బి కృష్ణయ్య స్పష్టం చేశారు. శనివారం హెచ్‌సీయూ క్యాంపస్‌లోని స్కూల్‌ ఆఫ్‌ లైఫ్‌ సైన్సెస్‌ ప్రాంగణంలో క్లీన్‌ అప్‌ డ్రైవ్‌ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్కూల్‌ ఆఫ్‌ లైఫ్‌ సైన్సెస్‌ ప్రాంగణంలో ప్లాస్టిక్‌ వాటర్‌ బాటిళ్ల తొలగింపు, బ్యాగులు, వ్యర్థ పదార్థాలు, చెత్తాచెదారం తొలగించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రామ్‌ అధికారి డాక్టర్‌ భీంసింగ్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ వాలంటీర్లు, శానిటేషన్‌, హార్టికల్చర్‌ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ట్రాక్‌ సూట్లు అందజేత



రంగారెడ్డి జిల్లా మాస్టర్స్‌కు ట్రాక్‌ సూట్లను అందజేస్తున్న కొండ విజయ్‌కుమార్‌

చందానగర్‌: ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు కేరళలో నిర్వహించే జాతీయ మాస్టర్స్‌ పోటీల్లో రంగారెడ్డి జిల్లా మాస్టర్స్‌ సత్తా చాటాలని అధ్యక్షులు కొండ విజయ్‌కుమార్‌ అన్నారు. శనివారం చందానగర్‌లో పీజేఆర్‌ స్టేడియంలో రంగారెడ్డి జిల్లా మాస్టర్స్‌కు ట్రాక్‌ సూట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ జిల్లా నుంచి 23 మంది మాస్టర్స్‌ 12 మంది మహిళలు, 11 మంది పురుషులు పాల్గొననున్నరన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి నునె సురేందర్‌, ట్రెజరర్‌ స్వాతి శివలీల రెడ్డి, నాగలక్ష్మి, శైలజ, శ్వేత, ఏసురత్నం, రామారావు పాల్గొన్నారు.

స్కూల్‌ స్థలాన్ని కాపాడుకుంటాం

రాజరాజేశ్వరీ కాలనీవాసులు



స్థలాన్ని చదును చేయడాన్ని అడ్డుకున్న స్థానికులు

గచ్చిబౌలి: రాజరాజేశ్వరికాలనీలో స్కూల్‌కు కేటాయించిన స్థలంను కాపాడేందుకు స్థానికులు ముందుకొచ్చారు. కొండాపూర్‌ సర్వేనెంబర్‌ 78 నుంచి 93 వరకు ఉన్న రాజరాజేశ్వరికాలనీలో 3,600 గజాల చదరపు స్థలాన్ని కొందరు వ్యక్తులు చదును చేసేందుకు జేసీబీతో అక్కడి వచ్చారు. ఇది గమనించిన కాలనీవాసులంతా ఒక్కచోట చేరి స్కూల్‌ కోసమని లేఅవుట్‌లో చూపించిన స్థలాన్ని మీరు జేసీబీతో ఎలా చదును చేస్తారని స్థానికులు అడ్డుకున్నారు. పనులు చేపట్టేందుకు వీలు లేదని స్పష్టం చేశారు. స్కూల్‌కు వదిలిన స్థలాన్ని అమ్ముకున్నారని వారిపై జీహెచ్‌ఎంసీ, హైడ్రాకు ఫిర్యాదు చేశామని రాజరాజేశ్వరినగర్‌ కాలనీ అధ్యక్షులు విజయ్‌కృష్ణ, కాలనీవాసులు తెలిపారు. స్కూల్‌ స్థలాన్ని కాపాడుకుంటామని స్పష్టం చేశారు.

ద్విచక్ర వాహనం ఢీ.. యువకుడు మృతి



రఘునాథ్‌ కాన్సే (ఫైల్‌)

మియాపూర్‌: ఓ ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ ఎస్‌ఐ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ..మహారాష్ట్రలోని సతారా జిల్లా డిప్కుల్‌కు చెందిన మయూర్‌ రఘునాథ్‌ కాన్సే(29) కానామెట్‌ ఇజ్జత్‌నగర్‌లోని హైటెక్‌ సిటీ పీజీ హాస్టల్‌లో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. గత మూడు నెలల కిందట నగరానికి వచ్చి హైటెక్‌ సిటీలోని ఫార్మా సొల్యూషన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు.ఈ క్రమంలో రఘునాథ్‌ కాన్సే విధులు ముగించుకుని శనివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో స్నేహితులైన ఆదిత్య, ఆశీష్‌ ఇద్దరితో హఫీజ్‌పేట్‌ వైపు టీ తాగడానికి వచ్చారు. ఆదిత్య, ఆశీష్‌ ఇద్దరు ఓ బైక్‌పై, రఘునాథ్‌ కాన్సే స్కూటీ పై వస్తుండగా హఫీజ్‌పేట్‌ రైల్వే స్టేషన్‌ ముందు మంజీరా రోడ్డులో 3 గంటల సమయంలో బజాజ్‌ ప్లాటినా ద్విచక్ర వాహనదారుడు వేగంగా వచ్చి రఘునాథ్‌ను ఢీకొట్టాడు. దీంతో ఇద్దరు కిందపడ్డారు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్నేహితులు ఆదిత్య, ఆశీష్‌లు రఘునాథ్‌ను దగ్గరలోని శ్రీకర హాస్పిటల్‌కు తరలించగా అక్కడ డాక్టర్లు పరిశీలించి రఘునాథ్‌ మృతి చెందినట్లు తెలిపారు. బజాజ్‌ ప్లాటినాపై వచ్చిన వ్యక్తి నూనె సాయి కుమార్‌ వేగంగా వచ్చి స్కూటీని ఢీకొనడంతో రఘునాథ్‌ కాన్సే మృతి చెందాడని స్నేహితుడు ఆదిత్య పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సాయికుమార్‌కు కూడా గాయపడడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. మియాపూర్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ ఓటరు దినోత్సవం

శేరిలింగంపల్లి: జాతీయ ఓటరు దినోత్సవాన్ని శేరిలింగంపల్లి సర్కిల్‌ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు, బీఎల్‌ఓలు, ఓటర్లతో డిప్యూటీ కమిషనర్‌ ముకుంద్‌రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. శేరిలింగంపల్లి సర్కిల్‌ కార్యాలయం నుంచి హెచ్‌సీయూ డిపో వరకు ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ బీఎల్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్స్‌కు సర్టిఫికెట్లను అందజేశారు.



పటాన్‌చెరు.. ర్యాలీలో అధికారులు, విద్యార్థులు



శేరిలింగంపల్లి సర్కిల్‌ ఆఫీస్‌ నుంచి హెచ్‌సీయూ డిపో వరకు అవగాహన ర్యాలీ

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు టౌన్‌: ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం జాతీయ ఓటర్ల దినోత్సవంను నిర్వహిస్తుందని, ఓటర్లందరూ పోలింగ్‌లో పాల్గొనేలా చేయడమే ముఖ్య ఉద్దేశమని ఓటర్‌ నమోదు అధికారి దేవుజా అన్నారు. శనివారం పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్‌ కళాశాల విద్యార్థులతో కలిసి తహసీల్దార్‌ కార్యాలయం వరకు అధికారులు ర్యాలీ నిర్వహించారు.

చందానగర్‌లో..

చందానగర్‌: చందానగర్‌ సరస్వతీ విద్యామందిర్‌ పాఠశాలలో జీహెచ్‌ఎంసీ సర్కిల్‌– 21 ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దేశ భవిష్యత్‌ యువత చేతుల్లో ఉందన్నారు.

రాయదుర్గంలో..

రాయదుర్గం: ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్‌ డాక్టర్‌ పూలపల్లి వెంకటరమణ సూచించారు. కొండాపూర్‌ సఫారీనగర్‌లోని న్యూబ్లూమ్స్‌ హైస్కూల్‌లో ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.